క్లుప్తంగా

పోస్టర్ విడుదల

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు క్రీడోత్సవ్ –2025 పోస్టర్‌ను రవితేజ జూనియర్ కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఖేలో భారత్ పేరుతో పోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారు బాబు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి శివ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిషోర్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తెలుగు రాష్ట్రాలలో బీసీల హక్కుల కోసం పోరాడిన కృష్ణయ్యకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఎనుగంటి రాజు, నీలం వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ

కందనూలు: రాష్ట్ర స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సాంఘీక శాస్త్రం టాలెంట్ టెస్ట్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అక్షయ ప్రతిభ కనబర్చి మూడోస్థానంలో నిలిచింది. నాగర్‌కర్నూల్ జిల్లా సోషల్ స్టడీస్ ఫోరం అధ్యక్షుడు జె. కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, క్లాస్‌మెట్ క్లబ్ అధ్యక్షుడు వాస రాఘవేందర్ విద్యార్థినిని అభినందించారు.

ఈదమ్మ దేవత పూజలు

కొల్లాపూర్: మహాబలిపురంలో కృష్ణశిలతో తయారుచేయించిన ఈదమ్మ దేవత విగ్రహాన్ని బుధవారం కొల్లాపూర్‌కు తీసుకువచ్చారు. పట్టణంలో ఈదమ్మ దేవత నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మాధవస్వామి దేవాలయంలో విగ్రహాన్ని నవధాన్యాలతో కప్పి ఉంచారు. శివస్వాములు దేవతామూర్తి విగ్రహానికి సంప్రదాయ పూజలు చేశారు. ఈ నెల 29న సప్తనదుల జల కలశాలతో దేవతామూర్తి విగ్రహాన్ని ఊరేగింపుగా ఈదమ్మ గుడి వద్దకు తీసుకువెళ్లనున్నట్లు విగ్రహ ఏర్పాటు కమిటీ నాయకులు వెల్లడించారు.

తహసీల్దార్‌కు వినతి

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, కోశాధికారి వెంకటస్వామిలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ జీకే మోహన్‌కు వారు వినతిపత్రం ఇచ్చారు.

మైలారంలో మైనింగ్ పనులు ఆపాలి

అచ్చంపేట రూరల్: మండలంలోని మైలారం గుట్టపై చేపడుతున్న మైనింగ్ పనులను వెంటనే ఆపాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కుందేళ్ల శంకర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనింగ్ పనుల వల్ల యాదవులు నష్టపోతారన్నారు. 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్ట ప్రాంతంలో జీవాలను, పశువులను మేపుతున్నారన్నారు. మైనింగ్ చేపడితే మూగ జీవాలకు మేత కరువై అల్లాడిపోతాయన్నారు. కార్యక్రమంలో విష్ణువర్దన్, శ్రీను, వెంకటయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టిజన్స్ దీక్షలు



దోమలపెంట: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను వెంటనే కన్వర్షన్ చేయాలని కోరుతూ ఈగలపెంటలో భూగర్భ కేంద్రం ఆర్టిజన్స్ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకుంది. వారికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కృష్ణయ్య, ఎస్.నర్సింహులు, ఎం.వీరయ్య, జి.నారాయణమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి మృతిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు జిల్లా కేంద్రంలో ఇంట్లో ఉరేసుకొని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. సంఘటనకు సంబంధించి బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బాలరాణి(37) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుందని, కుటుంబకలహాలతో మనస్తాపానికి గురై అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని వివరించారు. మృతురాలి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తీరనున్న కరెంటు కష్టాలు

- రూ.70 కోట్లతో మూడు సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు
- 24న డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన



కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన 132/33 కేవీ సబ్‌స్టేషన్

వంగూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వంత మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలో విద్యుత్ సమస్యలు లేకుండా అవసరమైన నిధులు మంజూరు చేశారు. మండలంలోని అన్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు కల్వకుర్తి 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. దాదాపు 30 కిలోమీటర్ల దూరం నుంచి విద్యుత్ సరఫరా కావడంతో వర్షాలు, గాలులు వచ్చినప్పుడు లైన్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి శాశ్వతంగా చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టారు. పోల్కంపల్లి సమీపంలో దాదాపు 5 ఎకరాల భూమిలో రూ.62 కోట్లతో 120/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. అదేవిధంగా ఉల్పరలో 33/11కేవీ నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎకరా భూమిని కూడా కేటాయించారు. గాజర సమీపంలో మరో 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.4 కోట్ల నిధులు మంజూరైనప్పటికీ స్థలం కేటాయింపు పూర్తికాలేదు. ఈ మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయితే మండలంలో విద్యుత్ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని విద్యుత్ అధికారులు అంటున్నారు.

24న ఉపముఖ్యమంత్రి భట్టి రాక

మండలంలోని పోల్కంపల్లి, ఉల్పర గ్రామాల్లో రూ.65 కోట్లతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖమంత్రి భట్టి విక్రమార్క వస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. నిర్మాణం పనులను కూడా వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఎంతో ప్రయోజనం...



పోల్కంపల్లి సమీపంలో 120/33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో విద్యుత్ సమస్య తీరుతుంది. మండలానికి చెందిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడంతో మండల అభివృద్ధికి అధికమొత్తంలో నిధులు మంజూరు అయ్యాయి. సబ్‌స్టేషన్ ఏర్పాటు పూర్తయితే సరఫరాలో అంతరాయం ఉండదు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–నరేందర్‌గౌడ్, రైతు, వంగూరు

పరిశ్రమలకు ఇబ్బంది ఉండదు..



కల్వకుర్తి ఉన్న సబ్‌స్టేషన్ ద్వారా మండలంలో ఉన్న పలు సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. వర్షాకాలం ఈదురు గాలులకు బ్రేక్‌డౌన్ కావడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు అయితే పరిశ్రమలకు, వ్యవసాయరంగానికి ఇబ్బందులు తొలగుతాయి.

– సతీష్‌రెడ్డి, గ్రామస్తుడు, పోల్కంపల్లి

శాశ్వత పరిష్కారం...



పోల్కంపల్లి గ్రామ సమీపంలో 120/33 సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.62 కోట్ల నిధులను కేటాయించింది. విద్యుత్ సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయితే ఈ ప్రాంతానికి ఎంతో మేలు చేకూరుతుంది.

– మేఘనాథ్, ఏఈ, వంగూరు

ఎక్సైజ్ అధికారుల దాడులు

కోడేరు: మండలంలోని నార్యానాయక్ తండా, సింగాయిపల్లి తండా, గుండ్యావాల్యానాయక్ తండా, ఒప్పితండాలో జిల్లా ఎక్సైజ్ అధికారి గాయత్రి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం పానకం, 60 కిలోల నల్లబెల్లం, 10 లీటర్ల సారాను ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా సారా అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మన్ననూర్: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది దాడులు చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణ, ఎస్‌ఐ సతీష్ తెలిపారు. మన్ననూర్‌లోని ఉమామహేశ్వర కాలనీలో విస్లావత్ బుజ్జి ఇంట్లో నిల్వ చేసిన 6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకునట్లు పేర్కొన్నారు. కాలనీ సమీపంలో చెట్ల పొదల్లో, వ్యవసాయ పొలాల్లో సోదాలు నిర్వహించి 300 లీటర్ల నల్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, విజయ్ భాస్కర్, గాయత్రి, ఎస్‌ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కోడేరు మండలం నార్యానాయక్ తండాలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు



మన్ననూర్‌లో

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డిపై అస్యత్య ఆరోపణలు, ప్రచారాలు చేస్తే ఊరుకోమని కాంగ్రెస్ మండల నాయకులు మాజీ ఎంపీపీ బండ పర్వతాలు సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, గుగ్గిల్ల ప్రకాశ్, మొగిళి నిరంజన్‌లు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిజమైన అర్హులను గుర్తించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేస్తే బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను రెచ్చగొట్టేందుకు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఓడించిన వారిలో అహంకారం తగ్గలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మారోసారి బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బండ పర్వతాలు, యాదయ్య, ప్రకాశ్, నిరంజన్, రాములు, శ్రీనివాసుల, కుర్‌సిద్ధ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ బండ పర్వతాలు

విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు రోడ్డు భద్రతపై చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీలో శాంతి నికేతన్ పాఠశాలకు చెందిన శ్రీవాణి మొదటి స్థానం, కస్తూర్బా బాలికల పాఠశాలకు చెందిన కావ్య రెండవ స్థానంలో నిలిచారు. వ్యాస రచన పోటీలలో బాలికల గురుకుల పాఠశాలకు చెందిన హర్షిని మొదటి స్థానం, కేకేరెడ్డి పాఠశాలకు చెందిన సిరి రెండోస్థానం, చిత్రలేఖనం పోటీలలో సిద్ధార్థ విద్యాలయానికి చెందిన జశ్వంత్ మొదటి స్థానం, శాంతనికేతన్ పాఠశాలకు చెందిన లలిత ద్వితీయ స్థానం గెలుపొందారు. ఈ నెల 23న నిర్వహించే జిల్లా స్థాయి పోటీలలో వారు పాల్గొంటారని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, సుఖజీన్ రెడ్డి, వెంకటేష్, కాశినాథ్, రేణయ్య, ఎల్లగౌడ్, శ్యామ్ సుందర్, బాల్‌నరసింహ తదితరులు పాల్గొన్నారు.



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

ఐకమత్యంతో ముందుకు సాగుదాం

కల్వకుర్తి: రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆ సంఘం అధ్యక్షుడు బండారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం సులువు అవుతుందన్నారు. అనంతరం సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రమోహన్, కృష్ణ గౌడ్, రవీందర్, వహీద్, శ్రీనివాస్, జాంగిర్, సర్తాజ్, నవాజ్, అంజి, శేఖర్ గౌడ్, అమ్రాబాద్ సురేష్, యాదగిరి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం రూ.4.20 లక్షలు



తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గుట్టపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను బుధవారం వేద విశ్వనాథ ఆలయం వద్ద లెక్కించారు. మొత్తం రూ.4.20 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



పెద్దకొత్తపల్లి: మండలంలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం గ్రామంలో బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రతాపరెడ్డి, సత్యం, చంద్రశేఖర్, స్వామి పాల్గొన్నారు.

కులాల పేరుతో పథకాలను దూరం చేయొద్దు



మన్ననూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను కులాల పేరుతో ప్రతిపక్ష నాయకులు కొందరు దూరం చేసేందుకు యత్నిస్తున్నారని ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌గోపాల్ ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు. కుల, మతాలకు అతీతంగా పథకాలు అందించమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొందరు రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కరిద్దరి పేర్లు రాకపోతే ప్రభుత్వాన్ని బద్నాం చేసే విధంగా కొందరు మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సునిల్, వెంకటయ్య, రాజు, జగపతి, సుగుణరావ్, మహేందర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



తాడూరు: ఎస్సీ వర్గీకరణను తెలంగాణలో అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఐతోలు లక్ష్మయ్య, బాలెంకటయ్యలు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 30న జిల్లా కేంద్రంలో లక్ష డప్పుల, వేయ్యి గొంతుల సన్నాహక సభను నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే మహా ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్, పరమేశ్వర్, నిరంజన్, జంగయ్య, రమేష్, రామస్వామి, గోపాల్, అనిల్ కుమార్, బుచ్చయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శేషయ్య(ఫైల్)

కొడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన వ్యక్తి చింత చెట్టుపై నుంచి కిందపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని బావాయిపల్లి గ్రామానికి చెందిన దేవరపాగ శేషయ్య(58) అనే వ్యక్తి మంగళవారం రాత్రి గ్రామ సమీపంలో వున్న చింత చెట్టును ఎక్కి కాయలు తెంపుతుండగా ప్రమాదావశాత్తు కిందపడ్డాడు. అక్కడ ఉన్నవారు చూసి వెంటనే కుటుంబీకులకు సమాచారమివ్వగా వారు హుటాహుటిన హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య, కర్రెమ్మ, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మన్ననూర్

మన్ననూర్: ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా చింతల చెరువు సమీపంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడా పోటీలలో గెలుపొందిన టీమ్ సభ్యులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మన్ననూర్‌కు చెందిన ఫ్రెండ్స్ క్రికెట్ టీమ్‌కు మాజీ సర్పంచ్ శ్రీరాం నాయక్ రూ. 30 వేల నగదుతో పాటు, రెండో బహుమతి అచ్చంపేటకు చెందిన ప్రేమ్ సీసీ టీమ్‌కు బీఆర్‌ఎస్ నాయకుడు అజ్మత్ పాషా రూ. 15 వేల నగదుతో పాటు షీల్డు అందజేశారు. మ్యాన్ ఆఫ్ సిరీస్‌గా రవి కుమార్ బహుమతి అందుకున్నారు. ఓం ప్రకాష్, అనుక్‌కుమార్, కేశవులు, కుమార్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

బిజినేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలకు 1970–71 సంవత్సరానికి చెందిన పూర్వ వృద్ధ విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌లోని పుప్పాల్‌గూడలో పూర్వ విద్యార్థిని సుహాసిని నివాసంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. మొత్తం 18 మందికి గాను 13 మంది పూర్వ విద్యార్థులు 54 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. మృతిచెందిన నలుగురి మిత్రులకు నివాళి అర్పించారు. తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రంగనాథం, శేషాచార్యులు, రమాదేవి, వేదావతి, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



పెద్దాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని 13వ వార్డు, మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో నిర్వహించిన సభలకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని.. జాబితాలో పేరు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ, మున్సిపల్ వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు వెల్లడించే అర్హుల జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, ఎంపీడీఓ కోటేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు పాల్గొన్నారు.

■ గ్రామసభలలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ దేవసహాయం హెచ్చరించారు. బల్మూరు మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. పేర్లు లేని వారు దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఇవ్వాలని అర్హులను పది రోజుల్లో ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రాఘవులు, డీటీ పరశునాయక్, ఎంపీఓ నర్సిరెడ్డి, కార్యదర్శి లక్ష్మన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

■ అర్హుందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. చారకొండ మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన హాజరయ్యారు. మండల కేంద్రంతో పాటు శేరి అప్పారెడ్డిపల్లిలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, జూపల్లి, జేపల్లి, తహసీల్దార్ సునీత, అదేవిధంగా అగ్రహారం తండా, రామచంద్రాపురం ఏఓ తనూజ రాజ్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఎంపీఓ వెంకటేష్, డీటీ విద్యాధరి రెడ్డి, ఆర్‌ఐ భరత్, ఏపీఓ లక్ష్మయ్య, పంచాయతీ రాజ్ ఏఈ దివ్య, ఆర్‌డబ్ల్యుస్ ఏఈ రితిష్ ఏఈఓలు, ఉపాధి అధికారులు, అయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

■ వెల్దండ మండలంలోని రాచూర్ గుండాల, బైరాపూర్, గాన్‌గట్టుతండా, కుప్పగండ్ల, చెదురుపల్లి, నగారగడ్డతండా, చెదురుపల్లి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాచూర్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. ఈనెల 26వ తేదీనుంచి నాలుగు పథకాలను ప్రారంభిస్తామన్నారు. కుప్పగండ్లలో స్వల్పంగా ఆయా పార్టీల నాయకులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. సంజీవ్‌కుమార్‌యాదవ్, పర్వత్ రెడ్డి, మోతిలాల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్, శివరాజ్, రమేష్‌గౌడు, తహసీల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఏఓ శోభారాణి, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఏఈఓలు, ఆర్‌ఐలు ఉన్నారు.

■ కొల్లాపూర్ మండలంలోని కుడికిల్ల, ఎన్మన్‌బెట్ల, ఎల్లూరు, సింగోటం, మొలచింతలపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. కుడికిల్లలో ఇందిరమ్మ ఇళ్ల పేర్లపై మాజీ ఎంపీటీసీ సభ్యులు కోంద్ర బిచ్చయ్య అధికారులను నిలదీశారు. సింగిల్ విండో డైరెక్టర్ రఘుపతి రావు కల్పించుకోవడంతో కొంత సేపు రసాభాస అయ్యింది. దివ్యజ్యోతి, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ పట్టణంలో ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించారు. పదో వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు రహీంపాషా, శ్రీదేవీగౌతంగౌడ్, డాక్టర్ రాముడు ఉన్నారు.

■ కల్వకుర్తి మండలంలోని గుండూరు, లింగసానిపల్లి, జిల్లెల్ల, ఎం గంపల్లి, వెంకటాపూర్ తండా, వెంకటాపూర్, సుద్ధకల్, ముకురాల గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీఓ వెంకట రాములు పాల్గొన్నారు.

■ తిమ్మాజిపేట మండలంలోని రాళ్ల చెరువుతండా నిర్వహించిన గ్రామసభలో ఆర్డీఓ సురేష్ హాజరయ్యారు. మారేపల్లిలో డీఈఓ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

■ లింగాల మండలం శాయిన్‌పేట, అవుసలికుంట, బాకారం, సూరాపూర్, చెన్నంపల్లి, దారారం, కోమటికుంట, కొత్తకుంటపల్లి, రాయవరం, క్యాంపు రాయవరంలలో గ్రామ సభలను నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ పాండు నాయక్, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

■ తెలకపల్లి మండలంలోని పెద్దపల్లి గట్టునెల్లికుదురు గ్రామాల్లో తహసీల్దార్ జాకీర్ అలీ, గోళగుండం, లక్నారం గ్రామాల్లో ఎంపీడీఓ శ్రీనివాసులు, గౌరారం, కారువంగ గ్రామాల్లో ఎంపీఓ వెంకటయ్య, ఆలేరు, గౌతమ్‌పల్లి ఏఓ నర్మదలు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

■ దోమలపెంటలో అమ్రాబాద్ ఎంపీడీఓ జగదీష్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నాయకులు బి.మల్లిఖార్జున, గురువయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

■ తాడూరు మండలం కేంద్రంతో పాటు మండలంలోని పాపగల్, శిర్సవాడ, ఐతోలు, అంతారం, ఎట్టిదార్‌పల్లి గ్రామాల్లో గ్రామసభలు కొనసాగాయి. లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీఓ అంజనేయులు, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీఓ బ్రహ్మాచారి, ఏపీఎం శేఖర్, ఎ సందీప్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ పెద్దకొత్తపల్లి మండలంలోని మరికల్ గ్రామసభలో జిల్లా రెవెన్యూ జాయింట్ కలెక్టర్ అమరేందర్ పాల్గొన్నారు. తహసీల్దార్ జీకే మోహన్, ఎంపీడీఓ నాగేందర్, సర్వేయర్ బాబు నాయక్, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెల్దండ మండలం రాచూర్‌లో మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చారకొండ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



బల్మూర్‌లో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ దేవసహాయం